సాక్షి
అనంతపురం
బుధవారం । 4 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.6

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.6, కనిష్టం రూ.2.50 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
31.7°/13.9°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలు అరికట్టాలి

- ఎస్పీ ఫక్కీరప్ప



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరాలను అరికట్టాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆదేశించారు. మంగళవారం పోలీసు కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా పోలీసు సిబ్బంది, అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. మహిళా పోలీసులు జాబ్ చార్ట్ ప్రకారం నడుచుకోవాలన్నారు. స్పందన అర్జీలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గృహ హింస, బాల్యవివాహాలు, ర్యాగింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర విషయాలపై వివరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య పరీక్షలు అందించేందుకు ఈగల్ ఐ యాప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

6న మెగా జాబ్ మేళా



కళ్యాణదుర్గం: ఎస్ఈఈడీపీ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జాబ్స్ కో ఆర్డినేటర్ ఎం.ఓబిలేశు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లమో, బీటెక్ పూర్తి చేసిన 18–35 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. మేళాలో కియా, వికాస్, వినూత్న ఫర్టిలైజర్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్, పైసా బజార్, హెచ్‌సీఎల్, కాంగేట్, యంగ్ ఇండియా వంటి సుమారు 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని, పెనుకొండ, హిందూపురం, బెంగుళూరు, హైదరాబాద్, అనంతపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 8247885109, 6304049368, 9550837679, 7880202003, 08554–280936 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'జగనన్న బడుగు వికాసాని'కి దరఖాస్తులు

అనంతపురం టౌన్: వైఎస్ జగనన్న బడుగు వికాసం పథకానికి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్పత్తి రంగ పరిశ్రమలతోపాటు సర్వీసింగ్, ట్రాన్స్‌పోర్టు రంగాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి 45 శాతం మేర సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పరిశ్రమల శాఖ కార్యాలయంలో సమాచార కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

మూడు ఇసుక రీచ్‌లకు అనుమతి



అనంతపురం టౌన్: జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లకు అనుమతులు మంజూరు చేసినట్లు గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. యల్లనూరు మండలం లక్ష్మంపల్లి, చింతకాయ మంద, చిలమకూరు గ్రామాల్లోని రీచ్‌లకు జిల్లా స్థాయి కమిటీ అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులు రాగానే ఇసుక తవ్వకునేందుకు పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ రీచ్‌లలో దాదాపు 4 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇక్కడి నుంచి జిల్లాలోని డిపోలకు ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

పరిశ్రమలకు స్వర్గధామం

- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద ఎత్తున కంపెనీలు
- మూడేళ్లలోనే రూ.300 కోట్ల పెట్టుబడితో 990 పరిశ్రమల స్థాపన
- 6,200 మందికి ప్రత్యక్ష ఉపాధి
- పరోక్షంగా మరిన్ని వేలమందికి..





ఇది పెనుకొండ మండలం గుడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైన ఎస్ఆర్ఎం కంపెనీ. 2021లో దాదాపు రూ.50 కోట్ల పెట్టుబడితో ఈ పరిశ్రమను నెలకొల్పారు. కార్ల సంబంధిత పరికరాలను రోబోల సహాయంతో తయారు చేసి కంపెనీలకు ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. ఏటా రూ.100 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న ఈ కంపెనీలో 200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. పరోక్షంగా వందల సంఖ్యలో కార్మికులు లబ్ధి పొందుతున్నారు.



హిందూపురం డివిజన్ పరిధిలోని గొల్లాపురం గ్రామంలో గతేడాది రూ.7 కోట్ల పెట్టుబడితో ప్రైమ్ ఇంటర్నేషనల్ కంపెనీ ఏర్పాటు చేశారు. గృహోపకరణాలైన డోర్లు, కిటికీలతోపాటు వివిధ రకాల వస్తువులు ఇక్కడ తయారు చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు కర్నాటక, తమిళనాడు, ముంబై తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 250 మంది కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు.

అనంతపురం టౌన్: పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి ఉమ్మడి అనంతపురం జిల్లా స్వర్గధామంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారమందుతుండడం, పెద్ద నగరాలకు సులువుగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తుండడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

మూడేళ్లలోనే 900 పరిశ్రమలు..

పారిశ్రామికవేత్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాలోని 5 ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేశారు. మౌలిక వసతులు కల్పించారు. వీటిల్లో పుట్టపర్తి మండలం కప్పల బండ, రాప్తాడు, ఆర్.అనంతపురం, కొటిపి గ్రామాల్లోని పార్కుల్లో 50 శాతానికి పైగా రాయితీతో పారిశ్రామికవేత్తలకు స్థలాలు కేటాయించారు. దీంతో గత మూడేళ్లలోనే రూ.300 కోట్ల పెట్టుబడితో 990 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఒక్క శ్రీ సత్యసాయి జిల్లాలోనే 800కి పైగా పరిశ్రమలు రూపుదిద్దుకున్నాయి.

6,200 మందికి ఉపాధి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. 990 పరిశ్రమల ద్వారా దాదాపు 6,200 మంది కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతుండన్నారు. పరోక్షంగా మరో 10 వేల మందికి ఈ పరిశ్రమలు ఉపాధి కల్పిస్తున్నాయి.

పారిశ్రామిక హబ్‌ల తయారీ లక్ష్యం..

రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి నియోజకవర్గాలను పరిశ్రమల ఏర్పాటుకు స్వర్గధామంగా మార్చి పారిశ్రామిక హబ్‌లుగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక సంకల్పంతో సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమల నుంచి సులువుగా ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక కారిడార్‌ను సైతం అభివృద్ధి చేస్తోంది. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు సైతం పరిశ్రమిస్తుండడంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నడూ లేని విధంగా తమ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటవుతుండడం, సమీపంలోనే ఉపాధి దొరుకుతుండడంతో జిల్లావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విధాల ప్రోత్సాహం

పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది. భూముల కేటాయింపుతోపాటు విద్యుత్ రాయితీలను సైతం అందిస్తోంది. హిందూపురం పారిశ్రామి కవాడ పరిధిలోని గొల్లాపురం, కొటిపిలో ప్రత్యేకంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటికే భూములను అభివృద్ధి చేశాం. మౌలిక వసతులు కల్పించాం. యువ పారిశ్రామికవేత్తలు యూనిట్ ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేక రాయితీలు కల్పిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

– మురళీమోహన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

- ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న డీహెచ్ఓ బి.రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ – ఎఫ్‌పీఓలు) ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక రాయితీలు అందజేస్తామని ఉద్యానశాఖ జిల్లా అధికారి (డీహెచ్ఓ) బి.రఘునాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఎఫ్‌పీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎఫ్‌పీఓలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఉద్యానశాఖ పరిధిలో సోలార్ డ్రయర్స్, కోల్డ్‌స్టోరేజ్ రూంలు, కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు 75 శాతం రాయితీని అందజేస్తోందన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద చిన్నపాటి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు రూ.10 లక్షల యూనిట్ విలువలో 35 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఇందుకు అవసరమైతే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. అంజూర, ద్రాక్ష లాంటి పండ్లతోటల రైతు సంఘాలు సోలార్ డ్రయర్స్, కోల్డ్ స్టోరేజ్ రూం ఏర్పాటు చేసుకుంటే విలువ ఆధారిత ఉత్పత్తుల (వాల్యూయాడెడ్) ద్వారా రెట్టింపు ఆదాయం పొందవచ్చునన్నారు. రైతులు ఐకమత్యంగా ఉంటేనే పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతుమిత్ర, ఎఫ్‌పీఓలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం అనురాధ, ఎల్‌డీఎం బి.నాగరాజారెడ్డి, ఉద్యానశాఖ ఏడీ నరసింహ రావు, హెచ్ఓ రత్నకుమార్, గ్రాంట్ తోర్టన్ ప్రతినిధులు రామాంజనేయులు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పనికి ముందే రేటు.. కావాలనే లేటు!

- రాప్తాడు నియోజకవర్గం మన్నీల పరిధిలోని భూమి(సర్వే నెం.25–4)కి సంబంధించి ఆర్ఓఆర్ (రైట్స్ ఆఫ్ రికార్డ్స్)కు యజమాని దరఖాస్తు చేసుకున్నారు. నెలల తరబడి తిరిగినా అనంతపురం తహసీల్దార్ కార్యాలయ అధికారులు కనికరించలేదు సరికదా.. ఆయన భూమిని వేరే వారి పేరున ఉన్నట్టు హక్కు పత్రాలు రాశారు. డైక్లాట్‌లో తనపేరే ఉన్నా తహసీల్దార్ అవతలి వ్యక్తి నుంచి భారీ మొత్తంలో డబ్బు తీసుకుని ఇలా చేసినట్టు యజమాని ఆరోపిస్తున్నారు.

- అనంతపురం రూరల్ మండలం నారాయణపురం పంచాయతీ పరిధిలో సర్వే నం.93–2లోని 2.84 ఎకరాల భూమిని వివాదంలో (డిస్‌ప్యూట్ ల్యాండ్ కింద) పెట్టారు. ఎలాంటి ఆర్డరు గానీ, ఆర్డీఓ కోర్టు నుంచి ఆదేశాలు గానీ లేకుండానే భారీగా డబ్బు తీసుకుని ఈ విధంగా చేసినట్టు తేలింది. నిజమైన హక్కుదారుడు మాత్రం బాధితుడిగా మిగిలిపోయాడు.

- సోములదొడ్డి గ్రామ పరిధిలోని సర్వే నెం.212–1ఎ లోని 5.50 ఎకరాల భూమిని ఇటీవలే వ్యవసాయ భూమి నుంచి కమర్షియల్ కిందకు బదిలీ చేశారు. దీనికి సంబంధించి కిందిస్థాయిలో ఎలాంటి కన్వర్షన్ రిపోర్టు గానీ, అధికారుల సంతకాలు గానీ లేవు. నేరుగా తహసీల్దారే అన్నీ చేసేశారు. ఇందులో భారీగా డబ్బు చేతులు మారినట్టు తెలిసింది.

- అవినీతి అడ్డాగా అనంతపురం తహసీల్దార్ కార్యాలయం
- సమస్యలు పరిష్కరించకుండా మరింత జటిలం
- బాధితులు లబోదిబోమన్నా కనికరించని వైనం
- ఆర్డీఓ కార్యాలయానికీ లింకు!



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఫైళ్లలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి వివాదమూ లేని భూములను కూడా వివాదంలో ఉంచేందుకు అవతలి పార్టీ నుంచి డబ్బు తీసుకుని ఆన్‌లైన్‌లో రెడ్‌మార్క్ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ భూమిని అమ్మడానికి, కొనడానికీ ఉండదు. చిన్న చిన్న ఫైళ్లకు కూడా డబ్బు అడగడం, ఇవ్వకపోతే ఫైలును నెలల తరబడి పెండింగులో పెట్టడం ఇక్కడ మామూలైంది.

ముఖ్య అధికారి మామూళ్ల పర్వం

తహసీల్దార్ కార్యాలయ ముఖ్య అధికారి ప్రతి పనికీ రేటు కట్టి యథేచ్ఛగా మామూళ్ల పర్వం కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. చివరకు జనన, మరణ ధృవీకరణ పత్రాలకూ లంచం తీసుకుంటున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. సదరు అధికారి అవినీతి వైఖరి నచ్చక ఒక దశలో ఇక్కడ పనిచేస్తున్న వీఆర్ఓలు సమ్మెలోకి వెళ్లాలని అసోసియేషన్ వద్దకు వెళ్లినట్టు తెలిసింది. తహసీల్దార్‌కు ఆర్డీఓ ఆఫీసులోని ఒక ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) సహకరిస్తున్నారని, ఇవన్నీ ఆర్డీఓకు తెలిసినా మిన్నకుండిపోతున్నారని సమాచారం. దాదాపు 7 లక్షల మందికి ఈ తహసీల్దార్ కార్యాలయమే దిక్కు. ఈ నేపథ్యంలో భూముల సమస్యలపై ఇక్కడకు వచ్చే వేలాదిమంది పరిస్థితి వేదనాభరితంగా మారింది.

ఉపేక్షించేది లేదు..



ఆర్ఓఆర్‌లు, ల్యాండ్ కన్వర్షన్‌లకు డబ్బు అడిగితే ఉపేక్షించేది లేదు. హక్కుదారులకు న్యాయం చేయకుండా ఫిర్యాదులను బట్టి భూములను వివాదాల్లో పెట్టడం సరి కాదు. దీనిపై ప్రత్యేక విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్

కొత్తగా 10 వేల పింఛన్లు



మెగా చెక్ విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

- అర్హత ఉన్న ఏఒక్కరినీ తొలగించం
- కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: అర్హులైన వారిలో ఏ ఒక్కరి పింఛను కూడా తొలగించలేదని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. కొత్తగా 10 వేల మందిని అర్హులుగా గుర్తించి మంజూరు చేశామని తెలిపారు. 'వైఎస్సార్ పింఛను కానుక' పెంపు సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో పింఛన్ల పెంపు వారోత్సవాల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ నెలకు సంబంధించి రూ.78 కోట్ల మెగా చెక్‌ను కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పలువురికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నిజమైన లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హత లేనివారి పింఛను ఎప్పుడైనా తొలగిపోతుందన్నారు. ఈనెలలో కొత్తగా పింఛను మంజూరైన వారితో లబ్ధిదారుల సంఖ్య 2,79,313కు చేరిందని, వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.77.972 కోట్లు విడుదల చేసిందని వివరించారు. జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ పథకాలను చిత్తశుద్ధితో అందించినప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫలాలు అందించాలనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈనెల 7 వరకూ జిల్లాలో పింఛను పెంపు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

8 పథకాల లబ్ధి పొందా



నేను వితంతు పింఛను తీసుకుంటున్నా. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎనిమిదింటి ద్వారా లబ్ధి పొందా. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నావడ్డీ, పంట నష్ట పరిహారం, ఇంటి పట్టా పొందా. మాలాంటి పేదలకు ఇన్ని విధాలుగా సాయం చేస్తున్న ప్రభుత్వాన్ని మొదటి సారి చూస్తున్నా.

– సావిత్రమ్మ, ఆలమూరు

జేసీ ప్రభాకర్‌కు జైలు భయం

- ప్రజల్లో ఉనికి చాటుకునేందుకే కొత్త నాటకం
- ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో గొడవలు సృష్టించాలనే ప్రయత్నం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: బీఎస్–3 వాహనాల కేసులో జైలు శిక్ష తప్పదని భావించిన జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్తనాటకానికి తెరలేపాడని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో అడుగడుగునా భయపడుతూ బతికిన పట్టణ జనం నేడు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తుండడాన్ని చూసి ఓర్వలేక గొడవలు సృష్టించాలనే పన్నాగంతో సేవ్ తాడిపత్రి అంటూ తిరుగుతున్నాడని ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జేసీ సోదరుల బతుకంతా దొంగ బతుకేనని విమర్శించారు. స్థానిక కోర్టులో ఎప్పటి నుంచో పని చేస్తున్న కొంతమంది సిబ్బంది జేసీ సోదరులకు కోవర్టులుగా పనిచేస్తున్నారని, వారికి రూ.30 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు లంచమిచ్చి చార్జ్ షీట్ మాయం చేశారని ఆరోపించారు. చంద్రబాబు స్ఫూర్తితో టీడీపీ హయాంలో జేసీ సోదరులు విచ్చలవిడిగా దోపిడీలు, దందాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తే ఎక్కడ తమను చంపేస్తారోననే భయంతో అప్పట్లో స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాడిపత్రిలో ప్రశాంత వాతావరణ నెలకొందని, నేడు ప్రజలందరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో గొడవలు, ఘర్షణలు సృష్టించాడనికి లేనిపోని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే సేవ్ తాడిపత్రి పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. అసలు తాడిపత్రికి ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. కుక్క మెడలో ట్యాగ్ వేసుకున్నట్లు జేసీ ప్రభాకర్ రెడ్డి తన మెడలో ప్లకార్డు వేసుకుని పట్టణంలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ బిచ్చగాని అవతారమెత్తుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నడూ లేని విధంగా తాడిపత్రి మున్సిపాలిటీలో బలమైన ప్రతిపక్షం ఏర్పడిందని, మున్సిపాలిటీలో తన దొంగ ఆటలు ఇక సాగవని భావించి నానాయాగీ చేస్తున్నాడని పేర్కొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్ఎం ద్వారా క్షయ విభాగంలో ఖాళీల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు వైద్యాధికారి అనుపమ జేమ్స్ తెలిపారు. ananthapuramu.ap.gov.inలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 6న నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

'నవోదయ'లో ప్రవేశాలకు నోటిఫికేషన్

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. లేపాక్షి విద్యాలయలో ప్రవేశాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2011 మే 1– 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. navodaya.gov.in. లేదా cbseitms.rcil.gov.in వెబ్ సైట్‌ల ద్వారా వివరాలు పొందవచ్చన్నారు.

పూర్వ ఏడీఏ అక్రమాలపై విచారణ ప్రారంభం



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

కణేకల్లు: కణేకల్లు వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో పూర్వ ఏడీఏ సనావుల్లా అక్రమాలు నిగ్గుతేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. పని చేసిన 10 ఏళ్ల కాలంలో సనావుల్లా సరైన రికార్డులు నిర్వహించకుండా మంజూరైన నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు ఇది వరకే ప్రాథమిక విచారణలో తేల్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఫారం బాధితులకు రూ.1.18 కోట్ల బకాయిలకుగాను ఓటీఎస్ ద్వారా 24 మందికి రూ.78.36 లక్షలు చెల్లించింది. ఈ చెల్లింపుల్లో కూడా ఏడీఏ అక్రమాలు చేశారని, 24 మందిలోనూ చాలా మంది బినామీలున్నారని, వారు డబ్బులను ఏడీఏకు తిరిగి చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ వాచ్ అండ్ వార్డుగా పని చేస్తున్న ఓ వ్యక్తి తన ఖాతా నుంచి ఏడీఏ భార్య ఖాతాకు డబ్బు పంపడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ మొత్తం అక్రమాలపై ఆరా తీసేందుకు ఆడిటర్లను పంపారు. మంగళవారం ఇక్కడికి చేరుకున్న ఆడిటర్లు అన్నపూర్ణ, మాధవీ, రాంబాబు.. పదేళ్ల రికార్డులన్నీ పరిశీలించారు. పూర్తిస్థాయిలో పరిశీలనకు నాలుగు రోజులు పడుతుందని తెలిపారు.

నిష్పక్షపాతంగా విచారణ

సనావుల్లా అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తామని డీఏఓ చంద్రనాయక్ స్పష్టం చేశారు. అగ్రికల్చర్ ఫాంలో టెస్ట్‌హార్వెస్టింగ్‌కు వచ్చిన డీఏఓ విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగంపై రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ చాలా సీరియస్‌గా ఉన్నారని, విచారణ తర్వాత చర్యలు తీసుకొంటారని తెలిపారు.

క్లుప్తంగా

హెచ్ఎంకు సావిత్రిబాయి పూలే అవార్డు



తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పి.హేమలత

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.హేమలత... తెలంగాణ గవర్నర్ తమిళిసై సుందర్‌రాజన్ చేతులమీదుగా సావిత్రిబాయి ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని జ్యోతిరావు పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా ఎక్సలెన్స్ అవార్డులు ఇస్తుంటారు. ఈ ఏడాది విద్యారంగంలో హేమలత చేస్తున్న కృషిని గుర్తించి ఆమెకు మంగళవారం తిరుపతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు అవార్డును గవర్నర్ తమిళిసై అందజేశారు. హేమలతకు అవార్డు దక్కడంపై ఎంఈఓ నాగమణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సెలవులో ఏపీఎంఐపీ పీడీ

అనంతపురం అగ్రికల్చర్: వ్యక్తిగత కారణాలతో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) డైరెక్టర్ జి.ఫిరోజ్‌ఖాన్ వారం రోజుల పాటు సెలవులో వెళ్లారు. బుధవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ కమిషనరేట్, కలెక్టర్ నుంచి ఆయన సెలవు అనుమతి తీసుకున్నారు. అనంతరం ఈ నెల 11న విధులకు హాజరుకానున్నారు. దీంతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీకి ఆటంకం కలగకుండా వారం రోజుల పాటు ఇన్‌చార్జి పీడీగా ఉద్యానశాఖ డీడీ బి.రఘునాథరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

- సమగ్రశిక్ష ఏపీసీ తిలక్‌సాగర్



రికార్డులు పరిశీలిస్తున్న తిలక్ విద్యాసాగర్

ఉరవకొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉరవకొండ కేజీబీవీ ఎస్ఓ ధనలక్ష్మిని సమగ్రశిక్ష ఏపీసీ తిలక్ విద్యాసాగర్ ఆదేశించారు. మంగళవారం ఉరవకొండ కేజీబీవీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు, మౌలిక వసతులు పరిశీలించారు. ఇటీవల కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైన అంశంపై ఎస్ఓతో ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... ఉరవకొండ కేజీబీవీ విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురి కాలేదని, సాధారణ జలుబు, దగ్గుతో ఇబ్బంది పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈశ్వరప్ప పాల్గొన్నారు.

అన్నదాతపై కక్షసాధింపు

- మిరప పంటపై కలుపు మందు పిచికారీ
- రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు
- వరుస ఘటనలతో రైతు కుదేలు

బొమ్మనహాళ్: అన్నదాతపై ప్రత్యర్థులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. కోతకు వచ్చిన పచ్చని పంట పొలంలో కలుపు నివారణ మందు పిచికారీ చేశారు. అంతటితో ఆగకుండా రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. వరుస ఘటనలో బాధిత రైతు కుదేలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం తారకాపురం గ్రామానికి చెందిన రైతు చాకలి నాగేంద్ర తనకున్న నాలుగున్నర ఎకరాల పొలంలో మిరప పంట సాగు చేశాడు. పంట కాయ దశలో ఉంది.

పథకం ప్రకారం పంటపై దాడి


రైతు నాగేంద్ర అంటే గిట్టని వారు సోమవారం అర్ధరాత్రి మిరప పంటలో క్షుద్రపూజలు చేశారు. పంటపై కలుపు మందు పిచికారీ చేసి, గ్రామంలోకి వెళ్లి నాగేంద్ర ఇంటి తలుపునకు బయటి నుంచి గొళ్లం పెట్టారు. అనంతరం అక్కడే ఉన్న రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. ఇందులో ఒకటి నాగేంద్రది కాగా, మరొకటి సమీప బంధువు నాగరాజుది. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో అక్కడికి సమీపంలో కట్టేసిన ఒంగోలు వృషభాలు గంతులేశాయి. ఆ సమయంలో వాటి మెడలో ఉన్న గంటల చప్పుడుకు రైతు నాగేంద్ర నిద్ర లేచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించాడు. తలుపులు గడియ పెట్టినట్లుగా గుర్తించి, గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు వచ్చి తలుపు గడియ తీశారు. అప్పటికే రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి.



కాలిపోయిన ద్విచక్ర వాహనం

రంగంలోకి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్

విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ ఎస్ఐ శివ తారకాపురం గ్రామానికి చేరుకుని మిరప పంటను, దగ్ధమైన ద్విచక్ర వాహనాలను, పొలంలో దుండగులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు, క్షుద్ర పూజ చేసిన కుండలు, టెంకాయ, నిమ్మకాయలు ఇతర వస్తువులను పరిశీలించారు. స్నిఫర్ డాగ్, క్లూస్ టీంను రంగంలో దింపి ఆధారాలు సేకరించారు.





మిరప పంటలో క్షుద్ర పూజలు చేసిన దృశ్యం, దుండగుల ఆచూకీని పసిగడుతున్న స్నిఫర్‌డాగ్

వ్యక్తిగత కక్షల్లేవు

బాధిత రైతు చాకలి నాగేంద్ర మాట్లాడుతూ.. తనకు గ్రామంలో ఎవరితోనూ వ్యక్తిగత కక్షలు లేవని, అయితే గత మూడేళ్లుగా ఈ తరహాలోనే కొందరు పంట నష్టం కలగజేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. 2021లో మిరప నారుకు కలుపు మందు పిచికారీ చేసి రూ. లక్షకు పైగా నష్టం కలిగేలా చేశారని గుర్తు చేశారు. అలాగే 2022, జూలైలో రెండు వ్యవసాయ సబ్‌మెర్సిబుల్ మోటార్లకు ఏర్పాటు చేసిన కేసింగ్ పైపులు కత్తిరించి మోటార్లను భూమిలోకి వదిలేశారన్నారు. దీంతో అప్పట్లో రూ.1.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. తాజాగా చేతికి రాబోతున్న మిరప పంటపై కలుపు మందు పిచికారీ చేసి రూ.5 లక్షలు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టి రూ.1.5 లక్షల నష్టం వాటిల్లేలా చేశారన్నారు. ఇందుకు కారకులెవరైంది గుర్తించి, తనకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక వికాసానికి ఆద్యురాలు సావిత్రిబాయి పూలే

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజమ్మ, అధికారులు

అనంతపురం సిటీ: సమాజాన్ని పట్టి పీడించిన రుగ్మతల నిర్మూలనలో కీలక పాత్ర పోషించిన సావిత్రిబాయి పూలే... సామాజిక వికాసానికి ఆద్యురాలిగా నిలిచారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. అనంతపురం ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా సావిత్రిబాయి పూలే సాగించిన పోరాటాలను కొనియాడారు. స్త్రీపురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం ద్వారా సహజమైన హక్కు లభిస్తుందని, అందుకే అందరూ ఉన్నత చదువులు అభ్యసించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డాక్టర్ బాలకుమారి, విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

- పెద్దవడుగూరు కేజీబీవీ ఎస్ఓకు జేసీ కేతన్‌గార్గ్ సూచన

పెద్దవడుగూరు: 'మనబడి నాడు–నేడు' కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని పెద్దవడుగూరు కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ లక్ష్మీదేవమ్మను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, మౌలిక వసతులను, రికార్డులను పరిశీలించారు. పదో తరగతికి విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. చిక్కీ, పాల నాణ్యత పరిశీలించారు. కాలం చెల్లిన వాటిని వంటలకు వినియోగించరాదని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. నాడు–నేడు పనులు పరిశీలించారు. తరగతి గదుల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంఈఓ రాముడు, తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఆర్ఐ శ్రీనివాసులు, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి ఉన్నారు.



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

రీ సర్వేపై ఆరా

పెద్దపప్పూరు: భూ రీసర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను జేసీ కేతన్ గార్గ్ ఆదేశించారు. పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడులో చేపట్టిన భూ సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంత వరకూ ఈ ప్రక్రియ పూర్తి చేశారనే అంశాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులు భూ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేయిస్తోందని, ఇందుకు అందరూ సహకరించాలని అక్కడి రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల హర్షం

రాయదుర్గంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో పాఠశాలల అభివృద్ధితో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కూడా కూడా పెద్దపీట వేసింది. ఇప్పటికే మున్సిపల్ పాఠశాలలను పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి తీసుకొచ్చింది. సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలు, నిర్ణయాలపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయులు ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయలకు డ్రాయింగ్ పవర్స్‌ను కట్టబెడుతూ జీఓ జారీ చేశారు. ఈ నిర్ణయంపై మున్సిపల్ ఉపాధ్యాయుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జీవో నెంబర్ 180తో జిల్లాలోని 27 మున్సిపల్ హైస్కూళ్ల హెచ్ఎంలకు డీడీఓ అధికారం దక్కింది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



డీడీఓ అధికారం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం. ఈ కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. డ్రాయింగ్ పవర్స్ కల్పించడం ఓ సువర్ణ అధ్యాయంగా చెప్పవచ్చు. దీని వల్ల పాఠశాలల అభివృద్ధి శరవేగంగా సాగుతుంది. పాఠశాలల ప్రగతికి దోహదం

– ఆదినారాయణ, హెచ్ఎం, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, రాయదుర్గం

పాఠశాలల ప్రగతికి దోహదం



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 180తో మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయులకు డీడీఓ అధికారం దక్కుతోంది. దీని వల్ల సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు చేకూరి పాఠశాలల ప్రగతికి దోహదపడుతుంది. చాలా కాలంగా నలుగుతున్న ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంది.

– రామాంజనేయులు, ఏపీటీఎఫ్, జిల్లా కార్యదర్శి, రాయదుర్గం

రూ.500కోట్లతో ఉపాధి పనులు

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 6 లక్షల మంది కూలీలకు పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. వలసలను నివారించే క్రమంలో మొత్తం 1.45 కోట్ల పనిదినాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద జిల్లా వ్యాప్తంగా 4వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగును చేపట్టినట్లు వివరించారు. రైతుల ఆసక్తిని బట్టి మరో 4 వేల ఎకరాలకు డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను విస్తరిస్తామన్నారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరేలా మామిడి, చీనీ, సపోట, నేరేడు, జామ, నిమ్మ, అంజురా పండ్ల మొక్కలతోపాటు డ్రాగన్ ఫ్రూట్, మునగ, పూల మొక్కల సాగును సైతం ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఏప్రిల్ మొదటి వారంలో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 80 చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు.

దోపిడీ యత్నం విఫలం

తాడిపత్రి అర్బన్: మహిళను కిందపడేటట్లు చేసి, ఇంటిని దోపిడీ చేసే యత్నం విఫలమైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... తాడిపత్రిలోని సంజీవనగర్‌కు చెందిన కొట్టే కొండారెడ్డి, కాంతమ్మ దంపతులు రేషన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కొండారెడ్డి తన కుమారుడిని పాఠశాల నుంచి పిలుచుకుని వచ్చేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఒంటరిగా వంటింట్లో కాంతమ్మ పనిచేసుకుంటోంది. ఈ విషయాన్ని గమనించిన బురఖా ధరించిన ఓ యువతి, చప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడి తలుపునకు లోపలి నుంచి గడియ వేసింది. అనంతరం తాను వెంట తెచ్చుకున్న నూనెను వంట గది ఎదుట బండలపై వేస్తుండగా కొండారెడ్డి ఇంటికి చేరుకున్నాడు. గడియ వేసి ఉండడంతో తలుపు తట్టాడు. దీంతో కాంతమ్మ వంట గది నుంచి బయటకు వచ్చింది. ఎదురుగా బురఖాలో ఉన్న యువతిని గమనించి, గట్టిగా కేకలు వేయడంతో ఆ యువతి తలుపు తీసి పారిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ టోర్నీ రన్నర్స్‌గా 'అనంత'



రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ టోర్నీ రన్నరప్‌ను అనంతపురం జట్టు దక్కించుకుంది. స్థానిక అనంత క్రీడాగ్రామం మైదానంతో పాటు నీలం సంజీవరెడ్డి స్టేడియం వేదికగా రెండు రోజుల పాటు పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, బొబ్బిలి టైగర్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన బొబ్బిలి జట్టు 12 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సందర్భంగా విజేత జట్లను అభినందిస్తూ డీఎస్పీ మల్లికార్జున వర్మ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంత వేదికగా రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీలను నిర్వహించడం గర్వకారణమన్నారు. పోటీల నిర్వహణకు ముందుకు వచ్చిన అంధ ఉద్యోగుల అసోసియేషన్‌ను అభినందించారు. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీలను ఇక్కడే నిర్వహిస్తే తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో అంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువగా 'మార్కెట్లు'

అనంతపురం అగ్రికల్చర్: గత డిసెంబర్ నెలాఖరుతో ముగిసిన 2022–23 మూడో త్రైమాసికానికి రూ.7.13 కోట్ల వసూళ్లతో జిల్లాలోని తొమ్మిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు లక్ష్యానికి చేరువయ్యాయి. ప్రస్తుతానికి ఓవరాల్‌గా 68 శాతం సాధించాయి.గడువు ముగిసేలోపు అంటే వచ్చే మార్చి నెలాఖరుకు వంద శాతం లక్ష్యం సాధించే దిశగా మార్కెటింగ్‌శాఖ పయనం సాగిస్తోంది.



అనంతపురం, రాప్తాడు అగ్రస్థానం

లక్ష్యసాధనలో అనంతపురం, రాప్తాడు, శింగనమల మార్కెట్‌కమిటీలు సంయుక్తంగా 90 శాతానికి పైగా వసూళ్లు సాధించాయి. ఇందులో రూ.3.50 కోట్లకు గానూ రూ.3.17 కోట్లతో అనంత మార్కెట్ యార్డు ముందజలో ఉంది. అలాగే రాప్తాడు రూ.44 లక్షలకు గానూ 40.03 లక్షలు, శింగనమల రూ.63 లక్షలకు గానూ రూ.57.01 లక్షలు సాధించడం విశేషం. 74 శాతం వసూళ్లతో తాడిపత్రి, 60 శాతంతో రాయదుర్గం లక్ష్యం దిశగా సాగుతున్నాయి. 28 శాతం వసూళ్లతో గుంతకల్లు మార్కెట్‌యార్డు చివరి స్థానంలో ఉంది. ఆ తర్వాత 35 శాతం వసూళ్లతో కళ్యాణదుర్గం, ఉరవకొండ, 38 శాతం వసూళ్లతో గుత్తి కమిటీలు వెనుకంజలో ఉన్నాయి. ఈ నాలుగు మార్కెట్ యార్డుల్లో ఈ ఏడాది వంద శాతం లక్ష్యసాధన కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లక్ష్యసాధనకు వెనుకబడిన కమిటీల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయనున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఒకరి మృతి



శ్రీరాములునాయక్ (ఫైల్)

కదిరి అర్బన్: తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా వేదసందూర్ దగ్గర సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే... కదిరి మండలం చవిటితండాకు చెందిన శ్రీరాములునాయక్ (50) అయ్యప్పమాల ధరించారు. ఇందులో భాగంగానే తనకల్లుకు చెందిన మినీ బస్సులో అయ్యప్ప ఆలయ దర్శనార్థం కేరళకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా వేదసంధూర్ వద్ద బస్సు అదుపుతప్పి డివైడర్‌కు ఢీ కొని బోల్తా పడింది. డ్రైవర్ ప్రసాద్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ఘటన జరిగిందని భక్తులు చెబుతున్నారు. బస్సు బోల్తా పడగానే డ్రైవర్ పరారైనట్లు పేర్కొన్నారు. అయితే ఈ ప్రమాదంలో శ్రీరాములునాయక్ అక్కడికక్కడే మృతి చెందగా బస్సు ఓనర్ భాస్కర్‌రెడ్డి, అమడగూరు మండలానికి చెందిన రఘులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడు శ్రీరాములునాయక్ కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఆయనకు భార్య పార్వతీబాయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచండి

అమరాపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో పాల్గొనే కూలీల సంఖ్య మరింత పెంచాలని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో ఎంతమందికి జాబ్ కార్డులు ఉన్నాయి..? ఎంత మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నరా... తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డులు అధికంగా ఉన్నా, పనులు చేసే కూలీల సంఖ్య మాత్రం వెయ్యి దాటడం లేదని అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. జాబ్ కార్డు కలిగిన వారంతా ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో కూలీల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. అనంతరం పంచాయతీల వారీగా ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలించారు.

కూలీల ఆధార్ అప్డేట్ చేయాలి : రొద్దం: ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీల ఆధార్ తప్పనిసరిగా అప్డేట్ చేయాలని, అప్పుడే కూలి డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఉపాధికి వచ్చే కూలీల సంఖ్య పెంచడంతో పాటు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

చిలమత్తూరు: సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న మండలంలోని మొరంపల్లికి చెందిన హరీష్ మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మృతుడు హరీష్ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన మూడు వీడియోలు సోషియల్ మీడియాలో మంగళవారం వైరల్ అయ్యాయి. 'తన చావుకు కారణం ప్రదీప్ అని పేర్కొనడంతో పాటు గత ఆదివారం మృతి చెందిన నవీన్‌కుమార్‌ను తాను చంపలేదని ఆ వీడియోలో హరీష్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం

ఉరవకొండ: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన రామాంజనేయులు (48) మంగళవారం రాత్రి విడపనకల్లు మండలం ఉండబండలో జరుగుతున్న ఊరి దేవరలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉరవకొండ సమీపంలోని జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమైన రామాంజనేయులును స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండ సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సత్యసాయినగర్‌లో మంగళవారం రాత్రి మంజునాథ్ అనే వ్యక్తి భార్య సునీత వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. మంజునాథ్ కర్ణాటక రాష్ట్రంలో సోలార్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలోనే భార్య సునీతతో గొడవ పడటంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి

పట్టణంలోని ప్రియాంకనగర్‌లో నివాసం ఉంటున్న సురేష్‌కుమార్ తన భార్య వరలక్ష్మిపై అనుమానంతో మంగళవారం రాత్రి దాడి చేశాడు. స్థానికులు గమనించి ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వరలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు చోరీకి విఫల యత్నం

తాడిపత్రి అర్బన్: నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణకు ఓ యువకుడు విఫల యత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని బుగ్గయ్య కాంపౌండ్ ప్రాంతంలో మంగళవారం రాత్రి చంద్రకళ, రత్నమ్మ షాపింగ్ ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నారు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై వెంబడిస్తూ చంద్రకళ మెడలోని బంగారు గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశాడు. దీంతో చంద్రకళ కింద కూర్చొంది. ఆ సమయంలో గొలుసు తెగిపోయింది. రత్నమ్మ గట్టిగా కేకలు వేయడంతో ద్విచక్ర వాహనంపై దుండగుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ఆనందరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగుడిని గుర్తించే ప్రయత్నం చేపట్టారు.

అంగళ్ల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని వివిధ బస్టాండ్‌లలో ఖాళీగా ఉన్న పక్కా అంగళ్లు, ఖాళీ స్థలాలు, మరుగుదొడ్ల నిర్వహణకు 4 నుంచి టెండర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణ అధికారి మధుసూధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం డిపో పరిధిలో 7, హిందూపురం 30, పెనుకొండ 15, కదిరి 30, మడకశిర 6, పుట్టపర్తి 12 మొత్తం పక్కా అంగళ్లు 30, ఖాళీ స్థలాలు 70 ఖాళీ ఉన్నాయన్నారు. నిబంధనలమేరకు దరావత్తు సొమ్ము చెల్లించి దరఖాస్తు ఫారాలను ఈనెల 18 లోపు పుట్టపర్తి ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. సీల్డ్ టెండర్ ఫారాలను 19 మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో తెరిచి ఖారారు చేస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఆయా డిపోల మేనేజర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యసమాచారం తెలుసుకొని ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకా ఏ డోసులు, ఏ నెలలో ఇస్తారో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ఓ చంద్రావతి, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు స్వామిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయంలోని మంజునాథస్వామి, వరలక్ష్మికి ప్రత్యేకపూజలు చేశారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆత్మకూరు బైపాస్ వద్ద ఉన్న అంగళ్లు, హోటళ్లు, దాబా నిర్వాహకులకు పలు సూచనలు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా కనిపించకుండా ఉన్న అంగళ్లను తొలగించి, సాధ్యమైనంత వరకు వెనక్కు జరుపుకోవాలని సూచించారు. హోటళ్లు, దాబా వద్ద పెద్ద వాహనాలు నిలపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డుపై కాకుండా దూరంలో వాహనాలు నిలపాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సనప విద్యార్థులు

ఆత్మకూరు: జిల్లాలోని పలు చోట్ల గత నెలలో జరిగిన హాకీ,షూటింగ్‌బాల్, బాక్సింగ్ క్రీడల్లో సనప జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ నాగరాజు తెలిపారు. పీడీ మాట్లాడుతూ అండర్ 17కు సంబంధించి షూటింగ్‌లో గణేష్, ముఖేష్, హేమంత్, నందిని ఎంపికై నట్లు తెలిపారు. హాకీ క్రీడలకు సంబంధించి అండర్-14, అండర్ - 17 విభాగంలో హర్షవర్దన్, రజిత, షర్మిల, సంధ్య, కళ్యాణి , శిరీష, అఖిల, యశ్వంత్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

రెట్టింపు ఉత్సాహం

రాప్తాడురూరల్: పింఛన్‌దారుల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందని కామారుపల్లి సర్పంచ్ లక్ష్మీకళ, ఎంపీటీసీ సభ్యురాలు రజిత అన్నారు. మంగళవారం సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధిని చర్చించి తీర్మానించారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్‌దారులకు పింఛన్ అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

రాప్తాడు: ఏపీటీఎఫ్ 2023 నూతన క్యాలెండర్, డైరీని ఎంఈఓ మల్లికార్జున ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి బాల కదిరప్ప పాల్గొన్నారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ప్రశాంతి మైండ్ కేర్‌లో పని చేసే యల్లమ్మ అనే మహిళపై ఆదివారం ఆమె సమీప బంధువులు కుసుమ, ఆమె, తల్లిదండ్రులు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన యల్లమ్మను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా బాధితురాలు టూటౌన్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక

రామగిరి: చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లికి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరాయి. గ్రామానికి చెందిన గొల్లప్పగారి పెద్ద శివయ్య, వేణుగోపాల్, అశోక్‌కుమార్, వంశీ, శివానంద, సుబ్రమణ్యం , కుమ్మరి శీన, కిరణ్, వెంకటేష్, నారాయణస్వామి, శ్రీరాములు, బయన్న, మహేష్, మల్లప్ప, వనిశెట్టి, నాగేంద్ర, ఓబలేష్, రామకృష్ణ తదితరులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా టీడీపీ పనిచేస్తున్నా పరిటాల కుటుంబీకులు తమకు గుర్తింపునివ్వలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల బాధ్యతలు కీలకం



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: సమాజంలో ల్యాబ్ టెక్నీషియన్ల బాధ్యతలు కీలకమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా ఉన్నతమైందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామీణ స్థాయికి వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖకు 47 వేల మందిని నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. వైఎస్సార్ గ్రామీణ వైద్య కేంద్రాల ద్వారా 65 రకాల టెస్టులను అందుబాటులోకి తీసుకొచ్చి, రోగ నిర్ధారణ చేసేలా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, డీసీహెచ్ఎస్ కృష్ణవేణి, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది మృతి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ జే బాబురావు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా పత్రాలను అందించారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున

అనంతపురం కల్చరల్: అంధులకు ప్రత్యేక లిపిని కనుగొని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయీ చిరస్మరణీయుడని జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున అన్నారు. మంగళవారం లూయీ బ్రెయిలీ 124వ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక కృష్ణకళామందిరంలో జరిగిన సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ రసూల్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడారు. అనంతరం జాతీయ అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా అంకిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగశివారెడ్డి, అశ్వర్థనారాయణ, కార్యదర్శులుగా సుధాకర్, అనిల్‌కుమార్‌లను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా ఎర్రిస్వామి, చంద్రయ్య, శంకరయ్య, హనుమక్క, ముత్యాలప్ప, సూర్యనారాయణ తదితరులు నూతన కమిటీలో ఉన్నారు. లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు నగరవీధుల్లో వందలాది మందితో ర్యాలీ జరగనుంది. 10 గంటలకు స్థానిక కృష్ణకళామందిరం వేదికగా బ్రెయిలీ జయంతి వేడుకలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

డీఐజీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక డీఐజీ కార్యాలయ సిబ్బందితో కలిసి డీఐజీ రవిప్రకాష్ మంగళవారం కేక్ కట్ చేసి, నూతన సంవత్సర వేడుకలు జరిపారు. డీఐజీ రవిప్రకాష్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, అదనపు ఎస్పీలు హనుమంతు, నాగేంద్రుడు, డీఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, నరసింగప్ప, వీరరాఘవరెడ్డి తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పోటీ పరీక్షల శిక్షణ యువతకు వరం



ఎస్పీ ఫక్కీరప్ప చేతులమీదుగా సన్మానం పొందుతున్న లావణ్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీ నిరుద్యోగ యువతకు వరమని అమరాపురానికి చెందిన లావణ్య ఆనందం వ్యక్తం చేసింది. పోలీస్ పోటీపరీక్షల శిక్షణను సద్వినియోగం చేసుకొని బ్యాంకు ఉద్యోగం సాధించిన లావణ్యను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి మంగళవారం సన్మానించారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురానికి చెందిన లావణ్య పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో పోటీపరీక్షలకు సన్నద్ధమైంది. కర్ణాటక బ్యాంకులో పీఓగా ఉద్యోగం సాధించింది. ఎస్పీ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించాలన్న లక్ష్యంతో ఇక్కడికి వచ్చి ప్రిపేర్ అవుతున్నారన్నారు. సివిల్స్‌కు కూడా సన్నద్ధమయ్యేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇక్కడ కంప్యూటర్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కష్టపడి చదువుకోవాలన్న తపన ఉంటే చాలు.. ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్పీ తెలియజేశారు.

అధికారుల పనితీరు మార్చుకోవాలి

- నగరపాలక సంస్థ అధికారులపై మేయర్ వసీం ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

అనంతపురం క్రైం: అధికారుల పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని నగరపాలక సంస్థ అధికారులపై మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మేయర్ చాంబర్‌లో అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ తదితర విభాగాల్లో కొందరు అధికారుల తీరుపై మేయర్, కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీంతో కమిషనర్ భాగ్యలక్ష్మి, ఎస్ఈ నాగమోహన్ నీళ్లు నమిలారు. నగరంలోని వివిధ పార్కుల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, చాలా సార్లు చెప్పినా పట్టించుకోలేదని కమిషనర్ కే భాగ్యలక్ష్మిపై మేయర్ అసహనం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ వర్కర్లు పత్తా లేకపోవడంతో పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. ఆర్ఐ చంద్రపై ప్రత్యక్షంగా ఫిర్యాదులు వస్తున్నా ,సీటు మార్చాలని చెప్పినా మార్చలేదన్నారు. లైట్ల మరమ్మతు, కొనుగోలు విషయమై డీఈ నరసింహులు, ఏఈ సాయిని మేయర్ ప్రశ్నించారు. కార్పొరేటర్లు ఇంజినీర్లపై మూకుమ్మడిగా ప్రశ్నల వర్షం కురిపించారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు జాప్యం చేస్తుంటే నోటీసులెందుకు ఇవ్వలేదని కార్పొరేటర్ సైపుల్లాబేగ్ ఎస్ఈ నాగమోహన్‌ను ప్రశ్నించారు. పనులు జాప్యం చేసే వారిని బ్లాక్ లిస్టులో చేర్చాలని కార్పొరేటర్లు అబూసలేహా, శ్రీనివాసులు, మునిశేఖర్, కమల్‌భూషణ్ కమిషనర్‌ను కోరారు. 9వ డివిజన్‌లోని ఎస్సీకాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి రూ.27లక్షలు నిలిచిపోయాయని ఎస్ఈ నాగమోహన్‌ను కార్పొరేటర్ దేవి నిలదీశారు. 32వ డివిజన్ ఆదర్శనగర్‌లో శానిటేషన్ అధ్వానంగా ఉందని చెప్పినా పట్టించుకోలేదని కార్పొరేటర్లు ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 48వ డివిజన్ నడిమివంకకు రక్షణ గోడ నిర్మించాలని కార్పొరేటర్ శ్రీనివాసులు కమిషనర్‌ను కోరారు. కార్పొరేటర్లు జయలలిత, రాజేశ్వరి, ముంతాజ్‌బేగం, సాకే చంద్రలేఖ తదితరులు డివిజన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. సమావేశానికి టౌన్ ప్లానింగ్ అధికారులు డుమ్మాకొట్టారు. సకాలంలో కౌన్సిల్, స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని మేయర్ వసీం కమిషనర్‌ను ఆదేశించారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు వైద్యం అందిస్తున్న దృశ్యం

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం మరూరులో ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు.యూరాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థో, జనరల్ జబ్బులకు ప్రత్యేక నిపుణులతో వైద్యపరీక్షలు చేశారు. దాదాపుగా 800 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం మందులు పంపిణీ చేసింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, సర్పంచు ప్రభావతి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ నారాయణస్వామి, కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్, పీడీ రమేష్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరులో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం హుండీ కానుకలు లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఈవో బీఆర్ వెంకటేశులు మాట్లాడారు. మొత్తం హుండీ ఆదాయం రూ. 4,13,729లు కాగా, గతంలో కన్నా రూ.37,599 అదనంగా వచ్చిందన్నారు. ఈసారి భక్తులకు మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. అంతకు ముందు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వత్సలానందన్, అయ్యప్ప భజన మండలి సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ముక్కోటి వేడుకలు

అనంతపురం కల్చరల్: స్థానిక రెవెన్యూ కాలనీలోని శ్రీకోదండ రామాలయంలో 24 గంటల పాటు సాగిన సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం ముగిసింది. విశ్వహిందూపరిషత్ మహిళా విభాగం లక్ష్మమ్మ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు పారాయణం ముగించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి బీఎస్ఎన్ఎల్ రాజశేఖరరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గోవింద వాసవి భజన మండలి అధ్యక్షుడు ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో స్థానిక బాలయోగి ఆశ్రమంలో భక్తుల కోసం www.govindabhajans.org వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

చియ్యేడు మాజీ సర్పంచ్ మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి గారి అప్పిరెడ్డి (92) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈయన 1975 నుంచి 1985 వరకు పదేళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందించాడు. గతేడాది వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అప్పిరెడ్డిని సన్మానించారు. అప్పిరెడ్డి మృతికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి నివాళి అర్పించారు. వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ గంగాధర్‌రెడ్డి ఉన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

అనంతపురం టవర్‌క్లాక్: దళితుల హక్కులను సాధించాలంటే పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు బీసీఆర్ దాసు అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీఆర్ దాసు మాట్లాడుతూ దళితుల మధ్య ఐక్యత లేకపోవడంతో పలు చోట్ల దాడులు జరుగుతున్నాయన్నారు. సంక్షేమ ఫలాలు కూడా సక్రమంగా దళితులకు చేరలేదన్నారు. రాజకీయాలకతీతంగా ఉంటూ దళితుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ఎంఎస్ రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు కేపీ నారాయణస్వామి, బాలపెద్దన్న, రామ్మోహన యాదవ్, సాకే పవన్, దాసగాని కుళ్లాయప్ప, ఐఎంఎం బాషా, మద్దెలచెరువు మల్లి, కదిరప్ప, బంగి నాగ, రవిరాజు, ఎల్లన్న పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఎస్ఐయూ చర్చిలో క్రిస్మస్ పర్వదినాలు, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో పాస్టర్ సంపత్‌విజయ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు సంఘ సభ్యులతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు.

డిస్కౌంట్‌తో 'లేపాక్షి' ఉత్పత్తులు

అనంతపురం కల్చరల్: లేపాక్షి హస్తకళాకారుల ఉత్పత్తులపై డిస్కౌంట్ ధరలు ఉంటాయని ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం లేపాక్షి ఎంపోరియంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు లేపాక్షి అమ్మకాలను పెంచుతున్నామని, అందులో భాగంగా నెల రోజుల పాటూ నిర్దేశించిన హస్తకళా ఉత్పత్తులపై 10 శాతం 30 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు.

విధులపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

అనంతపురం క్రైం: విధులపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థలో వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది, సచివాలయ నోడల్ ఎడ్యుకేషన్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశమయ్యారు. ముఖఆధారిత నమోదుకు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సచివాలయాల్లో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ కుల, ఆదాయ, నేటివిటీ, తదితర సచివాలయాల్లో అందించే సేవలను మీ సేవ సెంటర్లకు రెఫర్ చేయకూడదన్నారు. గతేడాది డిసెంబర్ 1 నుంచి లాంగ్‌లీవ్‌లో వెళ్లిన వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో అవ్వాతాత, అక్కచెల్లెమ్మలకు నూతనంగా మంజూరైన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకోసం ఎన్నోసంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. అంతేకాకుండా కులమత పార్టీలకతీతంగా అర్హులందరికీ అందించారన్నారు. ఈ ప్రాంతంలో పరిటాల కుటుంబం మూడు దశాబ్దాలుగా ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేసినా ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. మండలానికి 4,493 ఇళ్లను పేదలకు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో దేవరకొండ రిజర్వాయర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. బసంపల్లి, కనుముక్కల, పులేటపల్లి, మేడాపురం, వెంకటాపురం పంచాయతీల్లోని గ్రామాల్లోని 20 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ముందుగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల కన్వీనర్‌తో పాటు మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుంటాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఆత్మకూరు: అభివృద్ధి చేసే విషయంలో ముందుంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులో జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆత్మకూరులో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి మహర్షి కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

అధైర్యపడకండి..అండగా ఉంటాం: అధైర్యపడకండి..అండగా ఉంటామని ఆత్మకూరుకు చెందిన వెంకటశివారెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ భరోసా కల్పించారు. వెంకటశివారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించారు. ప్రమాద విషయాన్ని వెంకటశివారెడ్డి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులుచంద్రశేఖర్‌రెడ్డి, మధు, వాసుదేవరెడ్డి, బాలపోతన్న, వెంకట్రాముడు, ఫణిరెడ్డి , మల్లన్న, సద్దికూటి వెంకట్‌రెడ్డి, గూలి కొండారెడ్డి, బోయ వెంకటేష్, సోము, అతికిరెడ్డి, వన్నూరప్ప పాల్గొన్నారు.

కనగానపల్లి: అవ్వాతాతలకు పింఛన్లు, అక్క చెల్లెమ్మలకు చేయూత కింద డబ్బులు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులాగా మారాడని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రమణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, సుధీర్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రామగిరి: విద్యార్థులు చదువులో రాణించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతీసుకురావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మేడాపురంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి



ఎస్కేయూలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళిఅర్పిస్తున్న ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు, అంధులు

అనంతపురం సిటీ: సామాజిక విప్లవకారిణిగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి కొనియాడారు. మంగళవారం ఎస్కేయూలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ భారత తొలి ఉపాధ్యాయురాలిగా ఆమె నూతన వ్యవస్థ కోసం పోరాడారన్నారు. సమాజ కట్టుబాట్లు, బ్రాహ్మణవాద సంప్రదాయాలు, ఆధిపత్య వర్గాలను ధిక్కరించిన ధీశాలిగా ప్రొఫెసర్ శోభాలత, ప్రొఫెసర్ కృష్ణకుమారి అభివర్ణించారు. జెండర్ సమస్యలపైనా ఆమె పోరాటం కొనసాగించారని బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సీఎం అనురాధ తెలిపారు. రెక్టార్ ప్రొఫెసర్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవన్‌కుమార్, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ రమణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మహనీయుల సంస్మరణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్రప్ప, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.సందే మాధవరావు, ఆర్ఈఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ, ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గిరిజమ్మ మాట్లాడారు.

రాప్తాడురూరల్: పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా దేశ చరిత్రలో సావిత్రిబాయి నిలిచారని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట అంధుల ఆశ్రమంలో వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పూలే అవార్డు గ్రహీత, ప్రముఖ న్యాయవాది పద్మను సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శులు సురేంద్ర గౌడ్, సంఘాల లక్ష్మీనారాయణ, రాయలసీమ యువజన అధ్యక్షుడు జస్వంత్, జిల్లా యువజన అధ్యక్షుడు చిత్రా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్, రజక సంఘం నాయకులు నాగేంద్ర బాబు, నగర అధ్యక్షుడు అంకె తేజ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు విష్ణు, ప్రధాన కార్యదర్శి కేశవ, బీసీ నగర యువత అధ్యక్షుడు తలారి అంజి, ఉపాధ్యక్షుడు బెస్త తిరుపాల్ పాల్గొన్నారు.

అనంతపురం: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఎల్ఎం ఉమామోహన్ మాట్లాడుతూ భారత తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి అన్నారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్, రామాంజనమ్మ పాల్గొన్నారు.